మ్యాన్ ఆఫ్ ది మంత్

భద్రతా అవార్డుల ప్రదానం

సిటీబ్యూరో, జనవరి 23(నమస్తే తెలంగాణ): దక్షిణ మధ్య రైల్వే జోన్ పరిధిలో ఉన్న వివిధ డివిజనల్ సిబ్బంది తమ విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉంటూ అంకిత భావంతో విధులు నిర్వహించిన తొమ్మిది మంది ఉద్యోగులకు 'మ్యాన్ ఆఫ్ ది మంత్' భద్రతా అవార్డులను దక్షిణ మధ్య రైల్వే జోనల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ ప్రదానం చేశారు. ఈ మేరకు మంగళవారం సికింద్రాబాద్‌లోని రైల్వే నిలయంలో నిర్వహించిన భద్రతా సమీక్ష సమావేశంలో ఈ అవార్డులను అందజేశారు. ఎస్‌సీఆర్ అదనపు రైల్వే జనరల్ మేనేజర్ ఆర్.ధనంజయలతో పాటు రైల్వేకు చెందిన వివిధ విభాగాలకు చెందిన ప్రధానాధిపతులు, ఆరు రైల్వే డివిజనల్ మేనేజర్లు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. సికింద్రాబాద్ 5, విజయవాడకు 3, గుంతకల్‌కు 1, నాందేడ్‌కు 1, గుంటూరు 1 చొప్పున అవార్డులు దక్కాయన్నారు.

ఎంఏ, బీఏ (ఓ.ఎల్) పరీక్షా ఫీజు గడువు పొడిగింపు

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 23: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎంఏ (ఓరియంటల్ లాంగ్వేజెస్) పరీక్షా ఫీజు స్వీకరణ గడువును పొడిగించినట్లు ఓయూ పరీక్షల విభాగం, కంట్రోలర్ ప్రొ. రాములు తెలిపారు. ఈ కోర్సులకు సంబంధించి మొదటి, మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫీజును వచ్చే నెల 2వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని పేర్కొన్నారు. రూ.500 అపరాధ రుసుముతో 7వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను మార్చి నెలలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. బీఏ (ఓరియంటల్ లాంగ్వేజెస్) పరీక్షా తేదీలను సైతం ఖరారు చేసినట్లు ఆయన తెలిపారు. కోర్సుల మొదటి, మూడో, అయిదో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను వచ్చే నెల 3వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.in లో చూసుకోవచ్చని సూచించారు.

స్వర్ణోత్సవాలను జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న అతిథులు

వేదుకల్లో సాంస్కృతిక ప్రదర్శన ఇస్తున్న విద్యార్థులు

బిజినెస్ మేనేజ్‌మెంట్‌కు స్వర్ణోత్సవం

ఓయూ బిజినెస్ విభాగానికి 50 ఏండ్లు

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 23: ఉస్మానియా యూనివర్సిటీ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం ప్రారంభమై యాభై ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా మంగళవారం వైభవంగా స్వర్ణోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఓయూ తాగూర్ ఆడిటోరియంలో నిర్వహించిన ఈ ఉత్సవాలను పలువురు ప్రముఖులు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి, వైస్ చైర్మన్ ప్రొఫెసర్ వెంకటరమణ, ఓయూ వీసీ ప్రొఫెసర్ రవీందర్, మేనేజ్‌మెంట్ పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు శ్యామ్‌మోహన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మేనేజ్‌మెంట్ విభాగం యాభై ఏళ్ల చరిత్రలో వేలాది మంది విద్యార్థులకు విద్యా బుద్ధులు నేర్పిందని గుర్తుచేశారు. సమాజానికి అద్భుతమైన నిపుణులను అందజేసిందని చెప్పారు. అంకితభావానికి, నైపుణ్యానికి వేదికగా నిలిచిందన్నారు. మేనేజ్‌మెంట్ రంగంలో ఓయూకు బలమైన ప్రపంచ స్థాయి పూర్వ విద్యార్థుల సమూహం ఏర్పడిందని పేర్కొన్నారు. ఓయూ ఎంబీఏ గ్రాడ్యుయేట్లకు ప్రపంచ స్థాయిలో విస్తృత అవకాశాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. యూనివర్సిటీ బ్రాండ్ ఈక్విటీని పెంపొందించడం ద్వారా యాభై ఏళ్లలో డిపార్ట్‌మెంట్ ప్రస్థానాన్ని, విజయాలను విభాగం హెడ్ ప్రొఫెసర్ డి. శ్రీరాములు వివరించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు ప్రసన్నచంద్ర, టీవీ రావు, మేనేజ్‌మెంట్ డీన్ వెంకటయ్య, జహంగీర్, స్మిత సాంబ్రాణి, సంపత్ కుమార్, విద్యాసాగర్ రావు, సమున్నత, నరేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

కోటి ప్రత్యంగిరాలో శ్రీరామ పట్టాభిషేకం

శ్రీరాముని పట్టాభిషేకంలో సిద్ధేశ్వరానంద భారతి మహాస్వామి



మహాయాగంలో పాల్గొన్న ఎమ్మెల్సీ వాణీదేవికి జ్ఞాపికను అందజేస్తున్న స్వామి

హాజరైన ఎమ్మెల్సీ వాణీదేవి, విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన

కవాడిగూడ, జనవరి 23: అయోధ్య రామ మందిరంలో శ్రీ బాలరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా ఎన్‌టీఆర్ స్టేడియంలో మంగళవారం శ్రీ రాముని పట్టాభిషేకాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. నగరంలోని ఎన్టీఆర్ స్టేడియంలో కుర్తాళం శ్రీ సిద్ధేశ్వర పీఠం ఆధ్వర్యంలో శ్రీ సిద్ధేశ్వరానంద భారతి మహాస్వామి 88వ అవతరణ ఉత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న కోటి ప్రత్యంగిరా మహాయాగంలో భాగంగా మూడోరోజు శ్రీరాముని పట్టాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ వాణీదేవి, విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేనతో పాటు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అమోధ్య రామ మందిరంలో శ్రీ బాల రాముడి ప్రాణప్రతిష్ఠ సందర్భంగా శ్రీరాముని పట్టాభిషకం నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉన్నదని సిద్ధేశ్వరానంద భారతి మహాస్వామి పేర్కొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న భక్తులంతా శ్రీరామ జపం చేయడంతో స్టేడియం పరిసర ప్రాంతాలు శ్రీరామ నామస్మరణతో మార్మోగాయి. కోటి ప్రత్యంగిరా మహాయాగం వల్ల లోక కల్యాణం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిద్ధేశ్వరానంద భారతి మహాస్వామి పాల్గొని భక్తులకు అనుగ్రహం చేశారు. కార్యక్రమంలో రమ్యానంద భారతి స్వామి, పీఠం కో-ఆర్డినేటర్ మునిపల్లి శ్రీనివాస్, చీఫ్ అపరేటింగ్ ఆఫీసర్ మోచర్ల శశి భూషణ్‌తో పాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం, భక్తులకు తీర్థప్రసాద వితరణ, అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలి

ప్రొఫెసర్ అన్సారీ శాంతియుత దీక్ష

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 23: తనకు రావాల్సిన రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను ఇవ్వాలని ఉస్మానియా యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ మంగళవారం ఆందోళనకు దిగారు. ఓయూ లింగ్విస్టిక్స్ విభాగంలో ప్రొఫెసర్ మహ్మద్ అన్సారీ సుదీర్ఘకాలం పనిచేసి గతేడాది పదవీ విరమణ చేశారు. పదవీ విరమణ చేసి సంవత్సరం గడుస్తున్నా నేటికీ రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేస్తూ ఓయూ పరిపాలనా భవనం ముందు శాంతియుతంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఓయూ వీసీ ప్రొఫెసర్ రవీందర్ తనపై కక్ష గట్టి తనకు రావాల్సిన ప్రయోజనాలను నిలిపివేయించారని ఆరోపించారు. పదవీ విరమణ అనంతరం రావాల్సిన ప్రయోజనాలు ఇవ్వకుండా వేధింపులకు గురి చేస్తున్నారని వాపోయారు. తక్షణమే తనకు రావాల్సిన ప్రయోజనాలను ఇవ్వాలని కోరారు. లేని పక్షంలో తాను న్యాయస్థానాన్ని ఆశ్రయించాల్సి వస్తుందని హెచ్చరించారు.

25న జేఎన్టీయూలో నేషనల్ ఓటర్స్ డే

ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ గౌతమ్ ఆదేశాలు

సిటీబ్యూరో, జనవరి 22(నమస్తే తెలంగాణ): జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర్ రాజన్ పాల్గొంటున్న నేపథ్యంలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ అధికారులను ఆదేశించారు. కూకట్‌పల్లి జేఎన్టీయూలో ఈ నెల 25న జాతీయ ఓటర్ల దినోత్సవ రాష్ట్ర స్థాయి వేడుకలకు గవర్నర్ హాజరుకానున్న సందర్భంగా ఏర్పాట్లపై కలెక్టర్ మంగళవారం సమీక్షించారు. గురువారం ఉదయం 9 గంటలకు కూకట్‌పల్లి జేఎన్టీయూలో జరిగే రాష్ట్ర స్థాయి జాతీయ ఓటర్ల దినోత్సవ వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. రాష్ట్ర సీఈఓ వికాస్ రాజ్, చీఫ్ సెక్రటరీ శాంతి కుమారి పాల్గొంటారని తెలిపారు. జీహెచ్ఎంసీ కమిషనర్ ఏర్పాట్లపై బాధ్యతలు అప్పజెప్పిన అధికారులు సమర్థవంతంగా సమన్వయంతో అందరూ కలిసికట్టుగా పనిచేసి విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు. జిల్లాల నుంచి ఈ కార్యక్రమానికి హాజరయ్యే వారు కూకట్‌పల్లి ఆడిటోరియానికి ఉదయం 8.30 గంటలకే చేరుకోవాలని చెప్పారు. కార్యక్రమ విజయవంతానికి సమన్వయంతో అందరు పనిచేయాలని డిప్యూటీ సీఈఓ హరిసింగ్ కోరారు. కార్యక్రమంలో ఎన్నికల అడిషనల్ కమిషనర్, ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ వెంకటేష్ దొత్రే, కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్, ఈఎన్‌సీ జియావుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

నాల్గో తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం నియామకం

అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జ్ఞానేశ్వర్, గంగాధర్‌లకు నాయకుల సన్మానం

సుల్తాన్ బజార్, జనవరి 23: తెలంగాణ నాల్గో తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా గడ్డం జ్ఞానేశ్వర్, ప్రధాన కార్యదర్శిగా కొండూరు గంగాధర్‌లు మంగళవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు నాంపల్లి గృహకల్పలోని నాల్గో తరగతి ఉద్యోగుల కేంద్ర రాష్ట్ర కార్యాలయంలో బాధ్యతల స్వీకరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 33 జిల్లాలకు చెందిన నాయకులను సన్మానించి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం, వారు మాట్లాడుతూ నాల్గో తరగతి ఉద్యోగుల హక్కుల కోసం అలుపెరుగని పోరాటం చేస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీ, పాత పెన్షన్ అమలు, పీఆర్సీ, డీఏ విడుదల, ఓడీ కేంద్ర సంఘం రాష్ట్ర కార్యాలయానికి సంబంధించిన స్థలం కేటాయింపు, ఉద్యోగులకు ఇండ్ల స్థలాల మంజూరు వంటి అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కరించేందుకు తమ వంతు కృషి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో నాయకులు ఖాదర్ బిన్ హసన్, దాస్యా నాయక్, ధన్‌రా జ్,ప్రచార కార్యదర్శి జి శ్రీనివాస్, థామస్ పాల్గొన్నారు.

ప్రైవేటు కళాశాలల్లో నాణ్యతపై జేఎన్టీయూ దృష్టి

సిటీబ్యూరో, జనవరి 23(నమస్తే తెలంగాణ): జేఎన్టీయూ పరిధిలో కొనసాగుతున్న ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీలో నాణ్యమైన విద్యా విధానాన్ని అందుబాటులోకి తీసుకురావాలన్న లక్ష్యంతో జేఎన్టీయూ అధికారులు కసరత్తు చేస్తున్నారు. ప్రధానంగా 2024-25 విద్యా సంవత్సరంలో ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీ అఫ్షియేషన్ల కోసం ఈ సారి పకడ్బందీగా తనిఖీలు నిర్వహించనున్నట్లు తెలుపుతున్నారు. అయితే, కాలేజీలకు అనుమతులు ఇచ్చే క్రమంలో ఏఐసీటీఈ నిబంధనలు అందరు పాటించాల్సిందే అని అంటున్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారినప్పటికీ విద్యార్థులకు నాణ్యమైన విద్యా విధానం అందుబాటులోకి తీసుకురావడంలో జేఎన్టీయూ కృషి చేస్తుందన్నారు. అయితే ఉద్యోగ ఉపాధే లక్ష్యంగా నూతన కోర్సులను తీసుకురావడంతో పాటు సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ వంటి కోర్ గ్రూపులను ఎలాంటి విఘాతం కలుగకుండా నిర్ణయాలు తీసుకుంటామన్నారు. ఈ క్రమంలో నాణ్యమైన విద్యతో పాటు భవిష్యత్తు అవసరాలు తీర్చే విధంగా కూడా ఇంజినీరింగ్ విద్యను అందుబాటులోకి తీసుకురావడానికి కృషి చేస్తున్నామని యూనివర్సిటీ అధికారులు, ఆయా విభాగాల అధిపతులు, బోధనా సిబ్బంది అభిప్రాయపడుతున్నారు.

ఐఐఎంసీ కళాశాల డైరీ ఆవిష్కరణ

సిటీబ్యూరో, జనవరి 23(నమస్తే తెలంగాణ): ఐఐఎంసీ 2024-డైరీని కళాశాల చైర్మన్ విశ్వనాథం ఆవిష్కరించారు. కళాశాల సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరు విలువలతో కూడిన జీవన విధానానికి ప్రాధాన్యతనివ్వాలన్నారు. గౌరవ అతిథిగా హాజరైన కాలేజీ మాజీ ప్రిన్సిపాల్ పూర్ణచందర్ మాట్లాడుతూ తల్లిదండ్రులు గర్వించే స్థాయికి పిల్లలు ఎదగాలని, ఆధునిక పోటీ ప్రపంచంలో నైపుణ్యాలతోనే సాధ్యం అన్నారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ రఘువీర్, అధ్యాపకులు, సిబ్బంది, కౌన్సిల్ మెంబర్ పాల్గొన్నారు.

మీరాలం ఎస్టీపీ పనుల పరిశీలన

సిటీబ్యూరో, జనవరి 23(నమస్తే తెలంగాణ): జల మండలి ఎండీ సుదర్శన్ రెడ్డి మంగళవారం మీరాలం ఎస్టీపీ నిర్మాణ పనులను పరిశీలించారు. ఎస్టీపీ ఇన్‌లెట్ వద్ద సీవరేజి ఇన్‌ఫ్లోన్‌ను పరిశీలించారు. ఏయే ప్రాంతాల నుంచి మురుగు నీరు వస్తుందో ఎండీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. మీరాలం ట్యాంకు పరీవాహక ప్రాంతాల గురించి ఆరా తీశారు. అనంతరం, రోజూ నీటి నాణ్యతను ఎప్పటికప్పుడు పరిశీలించడం, రోజూ ఇన్‌ఫ్లో, అవుట్ ఫ్లో గణంకాలు లాగ్‌బుక్స్‌లో నమోదు చేస్తున్నారా? అని అధికారులను ఎండీ అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఈడీ డాక్టర్ ఎం.సత్యనారాయణ, ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్‌బాబు, సీజీఎం సుదర్శన్, ఇతర అధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

2030 నాటికి 150 గిగావాట్ల ఏసీసీయే లక్ష్యం

తెలంగాణ ప్రభుత్వ ఐటీ కార్యదర్శి జయేశ్ రంజన్

నిర్వాహకులతో కలిసి హాజరైన ఐటీ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేష్ రంజన్

మాదాపూర్, జనవరి 23: దేశంలో బ్యాటరీ తయారీ సరఫరా, పర్యావరణ వ్యవస్థను మెరుగుపరుస్తుందని ఐటీ కార్యదర్శి జయేశ్ రంజన్ అన్నారు. మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో మంగళవారం ఏర్పాటు చేసిన బ్యాటరీ మ్యానుఫాక్చరింగ్, సప్లై చైన్ సమ్మిట్ 2024కు ముఖ్య అతిథిగా ప్రిన్సిపల్ సెక్రటరీ జయేశ్ రంజన్ విచ్చేసి సీఈఎస్ ఇండియా ఎండీ, అధ్యక్షుడు, ఐఈఎస్ఏ అధ్యక్షుడు రాహుల్ వాలవాల్కర్, మినిస్ట్రీ ఆఫ్ మైన్స్ జేఎస్, డాక్టర్ వీణా కుమారి, యూఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్టేట్ సీనియర్ ఎకనామిక్ అధికారి ఫ్రాంక్ టలుటో, కబిల్ సీఈఓ సదాశివ్ సామంత రాయ్, అమర్‌రాజ బ్యాటరీస్ అధ్యక్షుడు విజయానంద్ సముద్రాలతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జయేశ్ రంజన్ మాట్లాడుతూ, ఏసీసీ, పీఎల్ఐ కింద జాతీయ ప్రభుత్వం ఇచ్చిన ప్రాధాన్యత, తెలంగాణతో పాటు మరికొన్ని రాష్ట్రాలు అందించిన మద్దతుతో పాటు ప్రైవేట్ రంగ సంస్థలు ఇచ్చిన మద్దతుకు మన దేశ అభివృద్ధికి ఎంతగానో దోహదపడ్డాయన్నారు. 2030 నాటికి 150 గిగావాట్ల ఏసీసీని సులభంగా అధిగమించగలమని విశ్వాసం వ్యక్తం చేశాడు. 2030 నాటికి 150 గిగావాట్ల ఏసీసీ లక్ష్యాన్ని సాధించవచ్చని ధీమా వ్యక్తం చేశారు. మన దేశంలో తయారయ్యే 150 ఏసీసీ గిగావాట్ బ్యాటరీ ఉత్పత్తిలో 30 గిగావాట్లు మన రాష్ట్రంలోనే తయారు కావడం గొప్ప విషయమన్నారు. ఈ బుధవారం వరకు కొనసాగనున్న ఈ కార్యక్రమంలో 300లకు పైగా ప్రతినిధులు హాజరయ్యారు.

విద్యా రంగంలోనూ ఏఐ కీలక పాత్ర

సదస్సుల్లో మాట్లాడుతున్న ఐటీ, విద్యా రంగ నిపుణులు

సిటీబ్యూరో, జనవరి 23(నమస్తే తెలంగాణ): రానున్న రోజుల్లో విద్యా రంగంలోనూ కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్-ఏఐ) ఎంతో కీలకంగా మారనుందని ఐటీ, విద్యా రంగ నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేశారు. టీ హబ్‌లో విద్యా రంగంలో కృత్రిమ మేధస్సు(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్-ఏఐ) ప్రభావంపై ఐటీ రంగ నిపుణులతో మంగళవారం ప్రత్యేక సదస్సు నిర్వహించారు. ఇన్ఫినిటీ లర్న్ సీఈఓ ఉజ్వల్ సింగ్, జేజీఐ స్కూల్స్ సీఈఓ, టీ హబ్ మెంటార్ డాక్టర్ డీపీ చంద్రశేఖర్‌లతో పలువురు ఐటీ నిపుణులు పాల్గొన్నారు. అన్ని రంగాల్లోనూ ఏఐ వినియోగం గణనీయంగా పెరుగుతున్నట్లుగానే విద్యా రంగంలో ఏఐ కీలకంగా మారుతుందని, దీని దృష్టిలో పెట్టుకొని ఔత్సాహిక స్టార్టప్ వ్యవస్థాపకులు ఆప్లికేషన్స్ రూపొందించేందుకు ముందుకు రావాలని సూచించారు.

క్రీడా పాఠశాలకు ఓఎస్‌డీని ఏర్పాటు చేయాలి

ప్రిన్సిపల్ సెక్రటరీకి విద్యార్థుల తల్లిదండ్రుల వినతి

శామీర్‌పేట, జనవరి 23: రెగ్యులర్ స్పెషల్ డ్యూటీ ఆఫీసర్(ఓఎస్‌డీ) ఏర్పాటుతోనే హకీంపేటలోని రాష్ట్ర క్రీడా పాఠశాలలో విద్యార్థుల సమస్యలు పరిష్కారం అవుతాయని విద్యార్థుల తల్లిదండ్రులు అభిప్రాయపడ్డారు. ఈ మేరకు మంగళవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎడ్యుకేషన్, స్పోర్ట్స్ అండ్ యూత్ సర్వీసెస్ ప్రిన్సిపల్ సెక్రటరీకి విద్యార్థుల తల్లిదండ్రులు విజేందర్, ఆనంద్, మహేశ్, మాలతి వినతి పత్రాన్ని అందజేశారు. తూంకుంట మున్సిపాలిటీ పరిధిలో గల రాష్ట్ర క్రీడాపాఠశాలకు రెగ్యులర్ స్పెషల్ డ్యూటీ ఆఫీసర్(ఓఎస్‌డీ) లేని కారణంగా విద్యార్థులు పలు రకాలుగా సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్కూల్‌కు రెగ్యూలర్ ఓఎస్‌డీ ఏర్పాటుతో పాటు షరతులతో కూడిన అంశాలతో పాటు స్కూల్ నిర్వహణ, పేరెంట్స్ కమిటీ ఏర్పాటు చేయాలని కోరారు.

అవిశ్వాసాన్ని వీడి అభివృద్ధిపై దృష్టి పెట్టండి

రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్

బండ్లగూడ, జనవరి 23: మేయర్ మహేందర్ గౌడ్ పై పెట్టిన అవిశ్వాస తీర్మానాన్ని ఉపసంహరించుకుని ప్రజల సమస్య పరిష్కారం వైపు దృష్టిని కేంద్రీకరించాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ పేర్కొన్నారు. ఇటీవల బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మహేందర్ గౌడ్‌పై డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డితో పాటు పలువురు కార్పొరేటర్లు అవిశ్వాస తీర్మానాన్ని ప్రకటిస్తూ కలెక్టర్ శశాంకకు నోటీసు అందజేసిన విషయం తెలిసిందే. వారం పది రోజులుగా అవిశ్వాస తీర్మానం చేసిన వారంతా క్యాంపులో ఉన్నారు. మేయర్ మహేందర్ గౌడ్ ఈ విషయాన్ని ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ దృష్టికి తీసువెళ్లారు. దీంతో ఆయన మంగళవారం బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మేయర్ మహేందర్ గౌడ్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నాలుగేండ్లుగా కార్పొరేషన్ అభివృద్ధికి మేయర్ మహేందర్ గౌడ్‌తో పాటు తాను నిరంతరం కృషి చేశామన్నారు. మేయర్ మహేందర్ గౌడ్ చేసిన తప్పులను చూపించాలని తెలిపారు. అవిశ్వాసం పేరుతో కాలయాపన చేయొద్దని హెచ్చరించారు. మేయర్ మహేందర్ గౌడ్ తప్పు చేసుంటే ప్రజలలో ఉండి తేల్చుకోవాలని, లేదా తమ దృష్టికి తీసుకు వస్తే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. తమపై ఎంతో నమ్మకంతో ఓట్లు వేసి ఎన్నుకున్న ప్రజలకు మోసం చేస్తే అభివృద్ధి కుంటు పడుతుందని తెలిపారు. వెంటనే అవిశ్వాస తీర్మానాన్ని ఉపసంహరించుకుని ప్రజల సమస్య పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో మేయర్ మహేందర్ గౌడ్, కార్పొరేటర్లు శ్రీలతా సురేష్ గౌడ్, పద్మావతి పాపయ్య యాదవ్, సాగర్ గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ రాందాస్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నర్సింహా, బీజేఎంసీ బీఆర్ఎస్ అధ్యక్షుడు సురేష్ గౌడ్, యువజన విభాగం అధ్యక్షుడు మల్లేష్ యాదవ్, నాయకులు పాపయ్య, అంతరం, నరేష్, రాజు, జగదీష్, విష్ణువర్ధన్ రెడ్డి, వెంకటేష్, రాజు, సుమన్ గౌడ్, సుందర్ గౌడ్, రాముడు యాదవ్ పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధి ఎట్లా జరిగింది?

జిల్లాలో పలు అభివృద్ధి, సంక్షేమ పథకాల పనితీరుపై నేడు జిల్లా మంత్రి సమీక్ష

సిటీబ్యూరో, జనవరి 23(నమస్తే తెలంగాణ): జిల్లాలో అభివృద్ధి ఏ విధంగా జరిగింది? గత కేసీఆర్ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు ఏ విధంగా అమలు చేశారు? ఎలాంటి అభివృద్ధి పనులు పూర్తి చేశారు? ఇంకా ఏమేమి పనులు పెండింగ్‌లో ఉన్నాయి? ఇంకా ప్రారంభం కావాల్సిన పెండింగ్ పనులు ఏమి ఉన్నాయి? డబుల్ బెడ్‌రూమ్‌లు నిర్మించి, ప్రారంభించకుండా ఎన్ని ఉన్నాయి ? వంటి సమగ్ర విషయాలపై జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టి సారించారు. జిల్లా అభివృద్ధి కోసం ఇంకా తీసుకోవాల్సిన నిర్ణయాలు ఏమిటి? జిల్లాలో ప్రభుత్వ భూములు కబ్జాలు కాకుండా ఎలాంటి నిర్ణయాలు తీసుకోవాలి? జిల్లా ప్రజల కోసం ఎలాంటి సంక్షేమ పథకాలు అమలు చేయాలి? రోడ్ల నిర్మాణాలు, ట్రాఫిక్ సమస్యలు, సంక్షేమ పథకాలు, గురుకులాల అభివృద్ధితో పాటు ఉచిత విద్యా, వైద్య సదుపాయాలు వంటి వాటిపైనా ఇన్‌చార్జ్ మంత్రి చర్చించనున్నట్లు కలెక్టరేట్ అధికారులు తెలిపారు. ఈ మేరకు జిల్లాలోని అన్ని శాఖలకు చెందిన అధికారులతో పాటు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఇప్పటికే సమీక్ష సమావేశం నిర్వహించారు. అధికారులంతా అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సంబంధించిన లెక్కలతో సహా అన్ని వివరాల ఫైళ్లతో సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. మంత్రి నిర్వహించే కార్యక్రమానికి డీఆర్వో, ఆర్డీవోలు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నట్లు కలెక్టరేట్ తెలిపారు.

తిరుపతికి నాలుగు రైళ్లు

సిటీబ్యూరో, జనవరి 23(నమస్తే తెలంగాణ): సికింద్రాబాద్-తిరుపతి రైల్వే స్టేషన్ల పరిధిలో నాలుగు ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేస్తున్నట్టు రైల్వే అధికారులు మంగళవారం తెలిపారు. ఈ నెల 25 నుంచి 28 వరకు ఇవి రాకపోకలు సాగిస్తాయన్నారు.

రాజకీయాలకతీతంగా గీత కార్మికుల అభివృద్ధి

- రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల కల్లు సొసైటీల ఆధ్వర్యంలో సన్మాన సభ
- హాజరైన బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఆబ్కారీ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ తదితరులు

కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన వారికి సర్వాయి పాపన్న జ్ఞాపికను అందజేస్తున్న సంఘం సభ్యులు

మైలార్‌దేవ్‌పల్లి, జనవరి 23: రాజకీయాలకు అతీతంగా గౌడ కులస్తుల అభ్యున్నతికి పాటుపడేందుకు సంఘం సభ్యులందరిని కలుపుకొని ముందుకు వెళ్లడం జరుగుతుందని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మైలార్‌దేవపల్లిలో రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల కల్లు సొసైటీల ద్వారా సన్మాన సభ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ బ్యాంకరీ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన జూపల్లి కృష్ణారావు, బీసీ సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్, రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్‌లను సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ గౌడలను విద్యా, ఉద్యోగ, రాజకీయ, సామాజిక, ఆర్థిక రంగాల్లో ప్రోత్సహిస్తూ వారి అభ్యున్నతికి పాటుపడతామన్నారు. గౌడల సమస్యలను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి ప్రమాద బీమాను ఐదు లక్షల నుంచి 10 లక్షలకు పెంచేలా కృషి చేస్